క్లుప్తంగా

గోరింటాకు సంబురం



వనపర్తి టౌన్: ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు అధిక ప్రాధాన్యత ఇస్తారని మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు చెన్న పద్మ, మదనాపురం మండల అధ్యక్షురాలు పద్మావతి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలు వివిధ ఆకృతులతో రెండు అరచేతులపై గోరింటాకును పెట్టుకున్నారు.

దళితబంధు ఇవ్వాలి



ఆత్మకూర్: రాష్ట్రంలోని నిరుపేద దళితులను గుర్తించి అర్హులైన వారికే దళిబంధు ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి బోరెల్లి రాము, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ అన్నారు. శుక్రవారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని, అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సూరి, వెంకట్రాములు, బాలకృష్ణ, రవి, అశోక్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రాముడు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న 14 మంది విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలు, వంటగది, టాయిలెట్లను పరిశీలించి ఎస్‌ఓకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ వాణి, వైద్యులు వినయ్‌కుమార్, పవన్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ శివారెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ లక్ష్మారెడ్డి, ఏఎన్‌ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు కల్పన, శ్రీలత, జానకి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల విడుదల



ఆత్మకూర్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌గౌస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈనెల 16న జరిగే రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. జోగులాంబ ఆలయంనుండి ప్రారంభం కానున్న యాత్ర వనపర్తి జిల్లా కేంద్రానికి 16న సాయంత్రం 5:30 గంటలకు చేరుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్వతమ్మ, శ్రీధర్, నరేష్, లక్ష్మి, విజయరాణి, జయమ్మ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన హరిజన్ ఊషన్న అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం మృతిచెందాడు. బాధిత కుటుంబ పరిస్థితిని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రూ.5వేలు పంపించారు. నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, రమేష్‌గౌడ్, రవిచందర్‌రావు, శంకర్‌నాయక్, సక్రునాయక్, లక్ష్మారెడ్డి, లక్ష్మయ్య, నరసింహ, యాదగిరిగౌడ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో కొద్ది రోజుల క్రితం ఎరుకలి బాలమ్మ బైక్‌పై నుంచి కిందపడి మృతి చెందింది. శుక్రవారం సర్పంచ్ వినీలారాణి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ జలీల్, వార్డు సభ్యుడు అంజి, సూరయ్య, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వనపర్తి: మండలంలోని చిమనగుంటపల్లి శివారులోని ఓ రైస్‌మిల్లులో రేషన్‌బియ్యం నిల్వ చేస్తుండగా శుక్రవారం ఎస్‌ఐ నాగన్న, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఫరీదా బేగం పట్టుకున్నారు. సుమారు 43 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో తీసుకొచ్చి మిల్లులో నిల్వ చేస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించుకోవడంలో ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ధర్మాపురం, నాగల్‌కడ్మూర్ గ్రామాల ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా అయా గ్రామాల్లో పర్యటించి వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్ యాడ్, నర్సరీలను పరిశీలించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం గ్రామాల్లో పచ్చదనంతో పాటు పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చాలన్న సంకల్పంతో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లను ఏర్పాటు చేసిందన్నారు. సేకరించిన చెత్తను ఒకచోట వేయడానికి డంపింగ్‌యార్డులను నిర్మించి తడి, పొడి చెత్తలను వేరు చేస్తూ వాటి ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ చేయిస్తూ పంచాయతీలకు ఆదాయ మార్గాలను పెంచిందన్నారు.

పాన్‌గల్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చెట్టు, చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలకు నీరు పట్టారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ విడత హరితహారంలో నాటేందుకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. వర్షాకాలం సీజన్ కావున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చెత్తను ఇష్టానుసారంగా కాలనీల్లో పారవేయకుండా పంచాయతీ ట్రాక్టర్లల్లో వేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఎన్ఎం సుమిత్ర అన్నారు. డ్రై డే లో భాగంగా శుక్రవారం మండలంలోని శాగాపూర్ గ్రామంలో కాలనీల్లో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారానికి ఒకసారి నిల్వ నీటిని పారబోసి కొత్తగా నీటిని పట్టుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు కేతేపల్లి, మాందాపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.



శాగాపూర్‌లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



ధర్మాపురం రహదారిలో మొక్కలకు నీరు పడుతున్న డీపీఓ సురేష్‌కుమార్

ట్రాక్టర్ డ్రైవర్‌గా సర్పంచ్ భర్త



కార్మికుల సమ్మె కారణంగా గోప్లాపూర్‌లో పంచాయతీ ట్రాక్టర్ నడుపుతున్న సర్పంచ్ భర్త

పాన్‌గల్: గోప్లాపూర్‌లో సర్పంచ్ రాణి భర్త దశరథం పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా మారారు. గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మె శుక్రవారానికి 9వ రోజుకు చేరుకుంది. గ్రామంలోని నర్సరీలోని మొక్కలు, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు ప్రతి నిత్యం ట్రాక్టర్ ద్వారా నీరు పట్టాలని ఉన్నతాధికారులు సూచించడం.. కార్మికులు సమ్మెలో ఉండటంతో సర్పంచ్ భర్త ట్రాక్టర్ డ్రైవర్‌గా మారి విధులు నిర్వహిస్తున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



భానుప్రసాద్



వసంత

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన చిట్టెమ్మ, లోక్యానాయక్ కుమార్తె వసంత బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మద్దిలేటి శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదివిన వసంత పదో తరగతి ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించింది. పాఠశాలలో చదివిన విద్యార్థిని ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కావడంపై హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, ఎస్‌ఎంసీ చైర్మన్ పాపన్న అభినందించారు.

మదనాపురం: మండల కేంద్రానికి చెందిన భానుప్రసాద్ పదో తరగతి పరీక్షల్లో 9.7 జీపీఏ సాధించడంతో బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడని జెడ్పీపాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

సింగిల్‌విండో మాజీ సీఈఓపై కేసు నమోదు

కొత్తకోట రూరల్: పామాపురం సింగిల్‌విండోలో రైతుల రుణాల దుర్వినియోగంపై కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యిందని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకా రం.. పామాపురం సింగిల్‌విండో నుంచి నాటవెళ్లి గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ 11మే, 2011లో ట్రాక్టర్ కొనుగోలు కోసం రూ.5.50లక్షలు రుణం తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని 2016 జులై 26న ఖాదర్ తిరిగి చెల్లించాడు. గతంలో సింగిల్‌విండో సీఈఓగా పనిచేసిన అయూబ్ నో డ్యూస్ సర్టిఫికెట్‌ను కూడా ఇచ్చారు. కానీ సింగిల్‌విండోలో ఇంకా రూ.5.81లక్షల బాకీ ఉన్నట్టు 2022 మార్చి 31న అబ్దుల్ ఖాదర్‌కు నోటీసు పంపడంతో అసలు విష యం బయటపడింది. దీంతో బాధితుడు పామాపురం సింగిల్ విండో కార్యాలయానికి చేరుకొని అప్పు కట్టిన రశీదుతో పాటు నో డ్యూస్ సర్టిఫికెట్ ను చూపించాడు. గతంలో సీఈఓగా పనిచేసిన అయూబ్, క్లర్క్ హబీబ్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలి



చిన్నంబావి: లక్ష్మీపల్లి చెరువులో నీళ్ల వృథాగా బయటకు వదిలేసి ఇసుక దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, రైతులు మహేష్, భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ఝాన్సీరాంనాయక్‌ను కోరారు. లక్ష్మీపల్లికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు అధికారులను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ పెద్దల అండదండలతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక దందా చేస్తున్నారన్నారు. అందువల్ల ఇసుక దందాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ వాహనాలను సీజ్ చేయాలని రైతులు తహసీల్దార్, ఎస్ఐలకు వినతిపత్రం అందజేశారు.

క్షయ నివారణపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్, కేతేపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ (టీబీ) వ్యాధి నివారణపై శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాల గురించి అవగాహన కల్పించి లక్షణాలు ఉన్న అనుమానితుల నుంచి వ్యాధి నిర్ధారణ కోసం తెమడ సేకరించారు. తీవ్రమైన దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పడుతుండటం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి ఉన్నట్లయితే తెమడ పరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఏఎన్ఎం సుమిత్ర, రాంచందర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



టీబీ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అర్హులందరికీ ఇంటి స్థలాలు



దుంపాయికుంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. గురువారం పట్టణంలోని దుంపాయికుంటను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలోని దుంపాయికుంటలో గతంలో ఇంటి నిర్మాణం కోసం పేదలకు స్థలాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. వాటికి హద్దులు చూపకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చేస్తున్నారని, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో మరోమారు సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులందరికీ ఇంటి స్థలాలను కేటాయిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అమరచింత: పట్టణ ప్రాంతాల్లోని మహిళలు ఎపొదుపు సంఘాల్లో రాణిస్తూ ఆర్థికంగా ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మెప్మా ఏఓ నాగమల్లేశ్వరి అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో పాల్గొని పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. 15 మంది అంతకన్నా తక్కువ మందితో కలిపి సంఘంగా ఏర్పడిన మహిళలు తమ సంఘాన్ని పట్టణ సమాఖ్యలో సభ్యత్వాన్ని తీసుకోవాలని సూచించారు. బ్యాంకు ద్వారా వచ్చిన రుణాన్ని అందరూ సమానంగా తీసుకొని వాటితో ఎలాంటి వ్యాపారం చేసుకోవాలనే ఆలోచనతో వాటిని వినియోగించుకుంటూ సకాలంలో బ్యాంకు కిస్తులు చెల్లించాలన్నారు. మహిళలకు వ్యక్తిగతంగా స్త్రీనిధి ద్వారా రుణాలను ఇస్తామన్నారు. అంతే కాకుండా వీధి వ్యాపారులకు ఆత్మనిర్భర్ ద్వారా రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రూపులోని సభ్యులందరూ కలిసి కట్టుగా ఉంటూ వాటిని బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ తమ కుటుంబాలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ మహిళ అభ్యున్నతి కోసం ప్రత్యేక రుణాలను బ్యాంకుల ద్వారా సబ్సిడీల రూపంలో అందిస్తుందన్నారు .కార్యక్రమంలో కమిషనర్ మహమ్మద్ ఖాజా, మెప్మా జిల్లా కోఆర్డినేటర్ బాలరాజ్, టీఎంసీ యువరాజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగమల్లేశ్వరి

రుణమాఫీ పేరుతో రైతులకు కుచ్చుటోపీ



కొత్తకోట ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట: రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఆ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతుబంధు డబ్బులను రైతులు తీసుకోకుండా బ్యాంకర్లు ఖాతాలను హోల్డ్‌లో ఉంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొత్తకోటలోని ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబంధు డబ్బులు వడ్డీ కింద బ్యాంకుల్లో జమ చేస్తూ రుణమాఫీ పేరుతో కేసీఆర్ రైతులను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. రుణమాఫీకి, రైతుబంధుకు ముడి పెట్టకుండా నేరుగా అన్నదాతలకు రైతుబంధు డబ్బులు ఇవ్వాలని బ్యాంక్ మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో జేసీబీ రాములుసాగర్, ప్రసాద్, ఉదయ్‌కుమార్‌గౌడ్, పెంటన్న, మోహన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, రామకృష్ణయాదవ్, నర్సింహ తదితరులు ఉన్నారు.



తిప్పడంపల్లిలో..

ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తులసీరాజ్, జిల్లా కార్యదర్శి రహ్మతుల్లా, ఎంపీటీసీ సభ్యురాలు సుచిత్ర అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పడంపల్లిలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంగ, శ్రీనివాసులు, ప్రహ్లాద్, బుచ్చిరెడ్డి, తిరుపతయ్య, ఈశ్వరయ్య, బ్రహ్మం, ఆంజనేయులు, రాజు, శివ, ఎల్లప్ప, నవీన్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

వనపర్తి టౌన్: సీఎం కేసీఆర్ దళితులను ఓటు బ్యాంక్ కోసం వాడుకొని వదిలేస్తున్నారని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఆగపోగు కుమార్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర దళిత మోర్చా అధ్యక్షుడు కొప్పు బాషా ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనతో రాష్ట్రం అవినీతి పాలవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉండి, గులాబీ జెండా మోసే దళితుల సంక్షేమమే కేసీఆర్‌కు ముఖ్యమని, రాష్ట్రంలో ఉన్న దళితుల సమస్యలు ఆయనకు పట్టవని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తుందని, అందుకు అనుగుణంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, నాయకులు బుడ్డన్న, సీతారాములు, గోర్ల బాబురావు, చెన్నయ్య, శ్రీనివాస్‌గౌడ్, కొమ్ము సామేల్, ద్యారపోగు సుబ్రమణ్యం, నరసింహ, ప్రవీణ్, నందిమల్ల రవి, రాములు, రాయన్న, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నంబావిలో ఎల్లేని సమక్షంలో బీజేపీలో చేరిన వెలటూరు యువకులు

బీజేపీలో చేరిక

చిన్నంబావి: మండలంలోని వెలటూరు గ్రామానికి చెందిన యువకులు కృష్ణ, వెంకటేష్, శ్రీను, నరసింహ, మద్దిలేటి, వెంకటేష్ నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. యువకులకు కండువాలు కప్పి సుధాకర్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. ప్రతి కార్యకర్తలకు పార్టీ తరఫున గుర్తింపు ఉంటుందని, కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో గణేష్‌రెడ్డి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఈ శ్రామ్ కార్డుతో కార్మికులకు ప్రయోజనం

అమరచింత: కేంద్ర కార్మిక శాఖ కార్మికుల సంక్షేమం కోసం ఈశ్రామ్ కార్డులను తీసుకొచ్చిందని, వారు మీసేవా కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సీనియర్ మెడికల్ ఆఫీసర్ స్వప్న సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ–శ్రామ్ పోర్టర్ ద్వారా బీడీ కార్మికులు తమ వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. దీంతో కార్మికుడికి ప్రమాదబీమా రూ.2 లక్షలు వర్తించడంతో పాటు వైద్యసేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. కార్మికులు తమ ఆధార్ కార్డ్ నెంబర్, మొబైల్ నంబర్, బ్యాంక్ ఖాతా నెంబర్లతో కూడిన జిరాక్స్ కాపీలను తీసుకొని మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. అమరచింతలో కేంద్రకార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీడీ కార్మికుల దవాఖాన పరిధిలోని గ్రామాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించండి

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు ఉన్న ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో 84 మంది విద్యార్థులు ఉండగా ఒక హెడ్‌మాస్టర్, ఒక డిప్యూటేషన్ టీచర్ మాత్రమే ఉన్నారని ప్రధానోపాధ్యాయుడు శివశంకర్ శుక్రవారం తెలిపారు. మన ఊరు మనబడి కింద ఎంపికైన పాఠశాలలో ఈ పాఠశాల ఒకటని, అన్ని వసతులు ఉన్నా కూడా టీచర్ల కొరత వేధిస్తుందని పేర్కొన్నారు. త్వరగా మరో ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని అధికారులను కోరారు.

పీఆర్సీ కమిటీని వేయాలి

కొత్తకోట రూరల్: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీ గడువు జూన్ 30న ముగిసిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని వేసి కమిటీ చైర్మన్‌ను నియమించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దమందడి మండలంలోని వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులతో తపస్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు కల్పించడంతో పాటు పదోన్నతులు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఏడాది నుంచి సరెండర్ సెలవులు, సీపీఎస్ విధానంలో ఉన్న ఉపాధ్యాయులకు డీఏ ఏరియల్స్‌ను నగదు రూపంలో ఇవ్వాలని, మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌గౌడ్, శశిధర్, అశ్విని రవికుమార్, రవికుమార్, పుల్లారెడ్డి, నళిని, దినేష్‌గౌడ్, అనసూయ, సుధారాణి, గిరిరాజయ్య, శ్రీకాంత్‌నాయక్, సురేష్, భాదర్‌బాషా, కురుమూర్తి తదితరులు ఉన్నారు.



రైతు సమస్యలపై నిరంతర పోరాటం

అమరచింత: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో శుక్రవారం రైతుసంఘం సభ్యత్వ సమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమెరికా పర్యటన సందర్భంగా అనేక వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు సుంకాలు తగ్గించే పద్ధతులకు పాల్పడిందన్నారు. టమాటా ధరలు తగ్గించి ప్రజలపై భారాలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్, మహేష్, శ్రీను ఉన్నారు.



సభ్యత్వాలు నమోదు చేస్తున్న నాయకులు

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

పాన్‌గల్: తమ డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 9వ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గణేష్, సర్పంచ్‌ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బాల్యనాయక్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, జీఓ నెం.60 ప్రకారం వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తూ వారికి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాము, కార్మికులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులు దేవుళ్లతో సమానమని ప్రకటిస్తే సరిపోదని వారికి జీతభత్యాలు సరిగ్గా అందించినప్పుడే ప్రజలు నమ్ముతారని అఖిల భారత ప్రజాతంత్ర్య మహిళా సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె ప్రారంభించి శుక్రవారానికి తొమ్మిది రోజులు అవుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా కాకపోవడం సిగ్గుచేటరు. వారు చేస్తున్న సమ్మెకు పూర్తి మద్దతు తెలుపుతున్నామని, జీఓ 60 ప్రకారం వెంటనే వారికి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.



పాన్‌గల్ సమ్మె శిబిరంలో భోజనాలు చేస్తున్న కార్మికులు